పేరులో గొప్ప.. అభివృద్ధిలో శూన్యం

- గాంధీనగర్‌లో మౌలిక వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గం
- స్లమ్‌పై చిన్నచూపు అంటున్న ప్రజలు



అధ్వానంగా గాంధీనగర్ రోడ్లు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలకసంస్థ పరిధిలోని చెంగిచర్ల గాంధీనగర్ కాలనీలో కనీస మౌలిక వసతులు లేక స్థానిక ప్రజలు దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారు. కాలనీ ఏర్పడి 23 సంవత్సరాలు కావస్తున్నా ఎలాంటి మౌలిక వసతులు లేవు. కాలనీలో ఇప్పటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టలేదు. ఎగుడు దిగుడుగా ఉన్న మట్టి రోడ్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే రాకపోకలకు స్తంభిస్తున్నాయి అధికారులు, పాలకవర్గం, మంత్రి చామకూర మల్లారెడ్డి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2000 సంవత్సరంలో గాంధీనగర్ ఏర్పాటు..

చెంగిచర్ల గ్రామంలో 2000 సంవత్సరంలో గాంధీనగర్ ఏర్పడింది. అప్పటి మంత్రి దేవేందర్‌గౌడ్ సర్వే నంబరు 13లోని 14 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 500 కుటుంబాలకు 60 గజాలు చొప్పన పట్టాలు మంజూరు చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి చెందిన అన్ని జిల్లాలకు చెందిన వారు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. అంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కావడంతో రెక్కల కష్టంపై బతుకుతున్నారు. గాంధీనగర్ ఒక వైపు చర్లపల్లి పారిశ్రామికవాడను, మరోవైపు చెంగిచర్లను ఆనుకుని ఉంది. బోడుప్పల్ నగర పాలకసంస్థకు చిట్టచివరన ఈ వీకర్ సెక్షన్ కాలనీ ఉంది.

కనీస మౌలిక వసతులు కరువు..

- కాలనీలో రాకపోకలు సాగించేందుకు ఒక్క రోడ్డూ సరిగ్గా లేదు. కాలనీ కొంత భాగం ఎత్తుగా, మరికొంత పల్లంగా ఉంది. గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. వర్షాలు పడినప్పుడు పారిశ్రామికవాడ నుంచి వచ్చే వర్షపు నీరు కాలనీలోకి చేరి దిగువ ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి నీరు చేరుతోంది. దీంతో వర్షాకాలం వచ్చిందంటే కొన్ని కుటుంబాలు అరిచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాయి.
- కాలనీ ఏర్పడి 23 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టలేదు. బోడుప్పల్ నగర పాలక సంస్థకు చిట్ట చివరన ఉండటంతో అక్కడ డ్రైనేజీ పనులు చేపట్టినా అవుట్ లెట్ లేకపోవడంతో ఇప్పటి వరకు పనులు చేపట్టలేకపోయినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.
- కాలనీలో ఇటీవల స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ మిషన్ భగీరథ్ పథకం కింద తాగునీటి సౌకర్యం కల్పించారు. 4 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతోంది. ఆ వచ్చే అరకొర నీరు ప్రజలకు సరిపోవడం లేదని, మిగతా కాలనీల మాదిరిగా తమ కాలనీలో రోజు విడిచి రోజు తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
- గాంధీనగర్ కాలనీలో అన్ని గుంతలతో నిండి మట్టి రోడ్లే ఉన్నాయి. శానిటేషన్ సిబ్బంది ఎప్పుడో గుర్తుకు వచ్చినప్పుడు ఊడుస్తున్నారు. కాలనీలో అక్కడక్కడా చెత్త చెదారం దర్శనమిస్తోంది. దోమలు, ఈగల సమస్య తీవ్రంగా ఉంది. పారిశ్రామికవాడను ఆనుకుని ఉండటంతో తరచూ అనారోగ్యానికి ఇక్కడ ప్రజలు గురవుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గాంధీనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు వేయాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోవడం లేదు. ప్రతి సంవత్సరం స్లమ్ ఏరియా ప్రాంతానికి ఖర్చు పెట్టే నిధులు ఇవ్వడం లేదు. స్లమ్ ఏరియా ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర, నగర పాలక సంస్థ నిధులున్నా వాటిని బోడుప్పల్‌లోనే ఖర్చు చేస్తూ గాంధీ నగర్ కాలనీ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు.

\- కొత్త లక్ష్మిరవిగౌడ్, డిప్యూటీ మేయర్

మా కాలనీ పట్ల చిన్నచూపు



మా కాలనీ పట్ల పాలక వర్గం, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. కాలనీలో సరైన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం లేదు. మాకు ఇచ్చిన 60 గజాల్లో చిన్న రూం వేసుకుని సెప్టిక్ ట్యాంక్ కట్టుకుని జీవిస్తున్నాం. పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే మా కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని అధికారులు, పాలకవర్గాన్ని కోరుతున్నాం.

\- అంజయ్యగౌడ్, కాలనీవాసి

క్లుప్తంగా...

వైద్య శిబిరానికి విశేష స్పందన

కాప్రా: కాప్రాలోని శ్రీఎన్‌క్లేవ్ ఎస్‌ఆర్‌ఐ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, లైఫ్ లైన్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, మ్యాక్స్ విజన్ ఐ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరంలో స్థానికులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వైద్యులతో పాటు కాలనీ అధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి నాంపల్లి రవి, ఉపాధ్యక్షులు మురళీ, రమేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లోని ఆనందర్‌నగర్‌లో రోడ్ నంబర్ 3/3లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు ఆదివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నాగయ్య, శ్రీనివాసరెడ్డి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం పలువురు డివిజన్ ప్రజలు శుభాకంక్షలు తెలిపి అభినందించారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.


క్రికెట్ కిట్స్ పంపిణీ



క్రికెట్ కిట్ అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో క్రికెట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొని రెండు టీమ్స్‌కు కిట్స్ అందజేశారు. యువకులు, విద్యార్థులు వేసవి శిబిరాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. జైకృష్ణ, నర్సింగ్, ప్రదీప్, శ్రీనివాస్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై చైతన్యం తీసుకురావాలి



అల్వాల్‌లో వినియోగదారుల హక్కుల సంఘం ప్రతినిధులు

అల్వాల్: వినియోగదారుల హక్కులు పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మల్కాజిగిరి పార్లమెంటరి వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు అన్నారు. ఆదివారం అల్వాల్‌లో జరిగిన మల్కాజిగిరి పార్లమెంటరి జనరల్ బాడీ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ధరలు, సేవలు వినియోగదారులకు పొందాల్సిన వాటిపై దృష్టి సారించాలన్నారు. వినియోగదారుల హక్కుల పట్ల చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శివకుమార్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు

కీసర: కేంద్రంలోని నరేంద్రమోదీ నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ గ్రామాల్లో ప్రజలు, యువత పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నట్లు మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రం రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కరీంగూడకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, వంగేటి బాపిరెడ్డి, కోల బాల్‌రాజ్, కొలిచెలిమి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



అల్వాల్: అల్వాల్‌లో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత సేవల శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా 5 ఏళ్ల నుంచి 13 సంవత్సరాలు కలిగిన పిల్లలకు చెవి, దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్‌ఎఓ డాక్టర్ మంజుల, ఆనంద్ బాగ్ దంత ఆసుపత్రి డాక్టర్ శాలిని, శ్రీనివాస్, అపోలో ఆస్పత్రి డాక్టర్ రమ్య, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఈశ్వర్‌రావు, సోమసుందరం పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కీసర: కీసరలో వరిధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు, గోడాన్ ప్రారంభోత్సవానికి మంత్రి మల్లారెడ్డి సోమవారం విచ్చేయనున్నట్లు కీసర రైతు సహకార సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి సొసైటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయండి

మేడ్చల్: నగరంలోని సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న నిరుద్యోగ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, యువకులు మధ్యాహ్నం వరకు కీసరలోని కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుని, అక్కడి నుంచి సభకు ర్యాలీగా వెళ్లాలని ఆయన కోరారు. సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సత్కారం



శ్రమశక్తి అవార్డులు అందుకున్న వారిని అభినందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్‌కు చెందిన శ్రమశక్తి అవార్డులు అందుకున్న కేశబోయిన మహేష్‌యాదవ్, గుడిసె సురేష్‌గౌడ్‌ను ఆదివారం కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి వారిని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. నాచారం యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీ కార్మికుల హక్కుల కోసం, సంక్షేమం కోసం కృషి చేస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. అనంతరం మహేష్ యాదవ్, సురేష్‌గౌడ్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకులు బోంగోని శ్రీహరిగౌడ్, పాండు, మంద సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: ఇటీవల వినాయక్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకునే సందర్భంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం వినాయక్‌నగర్ డివిజన్‌లోని హిల్ కాలనీ, వాజ్‌పేయినగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన జోడో యాత్ర ముగిసింది. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే అధికార కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, మీడియా కన్వీనర్ గుత్తి రాంచందర్, ఏఆర్ శ్రీనివాస్ యాదవ్, గిరియాదవ్, ఆశ, జీకేసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు సహకరిస్తాం



బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి



పూజల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ విరాట్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన అభయాంజనేయ, పోచమ్మ ఆలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణాలకు అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహేష్, వెంకటేష్, కరుణాకర్, శేఖర్, బాలరాజు, కాంతారావు, చంద్రమౌళి, సత్యనారాయణ, నవీన్, శ్రీను, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత సేవ

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నత విద్యాసేవలు అందించే కాలేజ్ దేఖో.. తాజాగా కెరీర్ క్యాంపస్ పేరిట సరికొత్త డిజిటల్ సేవల్ని ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. నగర విద్యార్థులకు వ్యక్తిగత లక్షణాల ఆధారంగా కెరీర్ అవకాశాలను సూచించడం, అవగాహన పెంచేందుకు రూపొందించిన ఉచిత సేవగా అందుబాటులోకి వచ్చిన కెరీర్ క్యాంపస్‌ను తెలుగులో సైతం సేవలందిస్తుందన్నారు. కేవలం 5 నిమిషాలు పట్టే సైకోమెట్రిక్ పరీక్ష ఫలితాల ఆధారంగా ఇది విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తుందన్నారు.

రుచి, శుచి, నాణ్యత పాటించాలి



హోటల్ ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి తదితరులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ హైవే రోడ్డులో ఏజీ గ్రాండ్ బిర్యాని హోటల్‌ను ఆదివారం మంత్రి మల్లారెడ్డి, స్థానిక మేయర్ జక్కా వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వినియోగదారులకు రుచి, శుచి, నాణ్యత కలిగిన తాజా ఆహార పదార్థాలను అందిస్తే వ్యాపారం అభివృద్ధి చెందుతుందన్నారు. కష్టపడి పనిచేస్తే ఏ వృత్తిలోనైనా రాణించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఏజీ గ్రాండ్ అధినేత ఎంఎ ముజీబ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసాలు

అల్వాల్: చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాలు ప్రకారం సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన కరుణాకర్‌రెడ్డి కొంతకాలంగా అనధికారికంగా చీటీలు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా చిట్టీలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తూ ఉండటంతో బాధితులు తాము మోసపోతున్నామంటూ భావించి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. స్థానికంగా నివసించే రాజేందర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలో ఎన్నో క్రీడా మైదానాలు



క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తూ..

రామంతాపూర్: చిన్న చెరువు గ్రౌండ్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి బత్తిని ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన రన్నర్ విన్నర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సిరిస్‌లకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత బండారి లక్ష్మారెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త నగదు బహుమతులు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా సీఎం కేసీఆర్ నేతత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో క్రీడలు అభివృద్ధి చెందాయని, ప్రభుత్వం ఎన్నో క్రీడా మైదానాల్లో నిర్మించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు తగిన రీతిలో సత్కరిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావుతో పాటు పలువురు టీఆర్‌ఎస్ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతో రాజ్యాంగానికి ప్రమాదం



మాట్లాడుతున్న ఎన్.బాలమల్లేష్

అల్వాల్: బీజేపీ పాలనలో లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులు హరించబడుతున్నాయని, రాజ్యాంగ మూలాలకు తీవ్ర ప్రమాదం ముంచుకొచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. ఆదివారం యాప్రాల్‌లో జరిగిన ఇంటింటికీ సీపీఐ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుతానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదన్నారు. ఈ దేశానికి మనుధర్మమే గొప్పదంటూ ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చెబుతున్నారని పేర్కొన్నారు. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను రాజ్యాంగం నుంచి తొలగించాలని కేంద్ర మంత్రులు సైతం చెబుతూ రాజ్యాంగాని మార్చాలని చెప్పడం తీవ్రంగా వ్యతిరేకించారు. దేశంలో ముస్లిం, క్రిస్టియన్లు, దళితులు, గిరిజనులు, మహిళాలపై దాడులు జరుగున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన హామీలను అమలు పర్చడంతో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసన సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించే నిరుద్యోగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఉప్పల్ సర్కిల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే విజయరామారావు హాజరయ్యారు. రాష్ట్రంలో నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందుకు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో జీవో 58 ఇళ్ల పట్టాలకు అవరోధం

- సర్వే నంబర్ 48లో పట్టాల పంపిణీపై అభ్యతరం
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన గీత కార్మిక సంఘం
- అధికారులకు, లబ్ధిదారులకు కోర్టు నోటీసులు



మాట్లాడుతున్న మేడిపల్లి గీత కార్మిక సంఘ నాయకులు

మేడిపల్లి: మేడిపల్లి పరిధిలోని సర్వే నంబర్–48 గౌడ కులస్తుల భూమిలో జీవో 58 కింద పంపిణీ చేసిన పట్టాలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపివేసిందని మేడిపల్లి గీత కార్మిక సంఘ అధ్యక్షుడు చెరుకు మహేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మేడిపల్లి మండల కేంద్రంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి సర్వే నంబర్–48లో కొంతమంది గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇటీవల రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, ఐదు ఎకరాల భూమిలో 50 సంవత్సరాల క్రితం నుంచి మేడిపల్లి గౌడ కులస్తులకు చెందిన పూర్వీకులు అక్కడ (ఈత చెట్ల పెంపకం) చేస్తున్నారన్నారు. గతంలో ఈ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడానికి సిద్ధం చేస్తుండగా 2004వ సంవత్సరంలో కోర్టును ఆశ్రయించగా యథావిధిగా కొనసాగించేలా ఉత్తర్వులు వచ్చాయని పేర్కొన్నారు. నాటి నుంచి కొన్ని సంవత్సరాల వరకు ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు జరగలేదని అన్నారు. కానీ కొన్ని సంవత్సరాల క్రితం కొంతమంది రాజకీయ నాయకుల అండతో రాత్రికి రాత్రే గుడిసెలు వెలిశాయన్నారు. ఆనాటి నుంచి న్యాయస్థానంలో పోరాటం కొనసాగిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. విషయం కోర్టు పరిధిలో ఉన్న సమయంలోనే తాజాగా జిల్లా అధికారులు 58, 59 జీవో కింద పట్టాలను పంపిణీ చేయడం శోచనీయమన్నారు. అధికారులకు అవగాహన లేకపోవడంతో సమస్యగా మారిందన్నారు. పూర్తి హక్కులు కలిగి ఉన్న ఈ స్థలాన్ని సాధించుకునేంత వరకు న్యాయపోరాటం చేస్తామని సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మెట్టు నాగయ్యగౌడ్, కుమార్‌గౌడ్, పల్లె శరత్‌గౌడ్, చెర్కు శివానంది సందీప్‌గౌడ్, ప్రశాంత్, దంతూరి వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష



రామంతాపూర్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ పరీక్ష రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పరీక్ష రాసేందుకు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఉదయం 11 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఆలస్యంగా వచ్చిన ఇద్దరు ముగ్గురు విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించలేదు. కఠిన నిర్ణయాలతో పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి

అల్వాల్: బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ బూత్ స్థాయిలో కృషిచేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం అల్వాల్ డివిజన్‌లోని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం అల్వాల్‌లోని పలు ప్రాంతాల్లో కమలం పువ్వు గుర్తు చిత్రీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ నాయకులు దండుగుల వెంకటేష్, బాలలింగం, సదానంద్‌గౌడ్, చంద్రశేఖర్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

